క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్‌ ఏటీఎన్‌ జీ షెడ్‌ వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 79,296 మంది స్వామిని దర్శించుకున్నారు. 33,511 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. టైంస్లాట్‌ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

బీజేపీ కనుసన్నల్లో టీడీపీ, జనసేన



మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్‌: కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజావంచన పాలన కొనసాగుతోందని పీసీసీ ప్రధాన కార్యదర్శి విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్‌ పార్టీ నగర అధ్యక్షుడు గొడపేరు చిట్టిబాబు 25 మందితో కూడిన కాంగ్రెస్‌ నగర నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్‌ రాజ్యాంగం రాజ్యమేలుతోందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్నాయని మండిపడ్డారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలతో శుక్రవారం శ్రీకాళహస్తిలో ముఖాముఖి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

భోజనం వితరణ


పారిశుద్ధ్య కార్మికులకు భోజనం అందిస్తున్న లయన్స్‌క్లబ్‌ సభ్యులు, సర్పంచ్‌

పాకాల : మేజర్‌ పంచాయతీ పాకాలలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో భోజనం వితరణ చేశారు. పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు తులసీరామన్‌ పారిశుద్ధ్య కార్మికులతో పాటు సిబ్బంది సుమారు 50 మందికి భోజనం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ఎస్‌.కస్తూరి, ఈఓ లావణ్యలత, లయన్స్‌క్లబ్‌ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి రూ.1,01,221 విరాళం


ఈఓ జయకుమార్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్‌: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చిలకం శ్రీదేవి, చిలకం లక్ష్మీనారాయణరెడ్డి దంపతులు గురువారం రూ.1,01,221 విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని ఆలయ ఈఓ జయకుమార్‌కు దాతలు అందజేశారు. విరాళం సొమ్మును అమ్మవారి ఆలయ నిర్మాణానికి వినియోగించాలని దాతలు కోరారు.

హామీలకు కూటమి పంగనామం


కలెక్టరేట్‌ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, సీపీఎం నేతలు

తిరుపతి అర్బన్‌: అధికారం కోసం ఆర్భాటం తప్ప.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి మండిపడ్డారు. గురువారం తిరుపతి కలెక్టరేట్‌ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ సీపీఎం నేతలతో కలసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌ హామీలకు ప్రభుత్వం పంగనామాలు పెట్టిందని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటుపరం కాకుండా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాకాల : మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌ హెచ్‌ఎంగా డి.సుమతమ్మ బాధ్యతలు స్వీకరించారు. గురువారం పాఠశాలలోని ఉపాధ్యాయులు ఆమెను సాదరంగా ఆహ్వానించారు.

సపరేటు బదిలీలు

బదిలీల పర్వం మొదలైంది. డిమాండ్‌ ఉన్న పంచాయతీలకు వెళ్లేందుకు సపరేటుRగా మాట్లాడుకున్నారు. తనకు కావాలంటే.. తనకు కావాలంటూ ఉద్యోగులు పోటీ పడ్డారు. డిమాండ్‌ను బట్టి కోరుకున్న స్థానంలో కూర్చునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేశారు. ముందస్తుగా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకున్నా.. బదిలీ చేసే అధికారిని ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడ్డారు. మీరు ఒక లెటర్‌ ఇవ్వండి సార్‌.. మిగిలిందంతా మేం చూసుకుంటామంటూ ఆ ఎమ్మెల్యే కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టారు.. అదీ కుదరక పోతే ఉన్నతాధికారుల ద్వారా సీటు కొనుగోలుకు సిద్ధపడ్డారు.. ఈసారి బదిలీల్లో అయినా నిబంధనలు పాటిస్తారనుకున్న ఉద్యోగులకు నిరాశే ఎదురైంది.



- తిరుపతి రూరల్‌ మండలంలో 30 మంది పంచాయతీ కార్యదర్శులకుగానూ 17 మంది బదిలీ
- బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు
- డిమాండ్‌ ఉన్న పంచాయతీలో సీటు కోసం సపరేటు'
- ఎమ్మెల్యేల లేఖలకు ప్రాధాన్యం ఇచ్చిన అధికారులు
- కోరుకున్న స్థానం ఇవ్వలేని వారికి పదోన్నతి

తిరుపతి రూరల్‌ : రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ విభాగాల్లో ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం కొన్ని రకాల మార్గదర్శకాలు విడుదల చేసింది. పంచాయతీ కార్యదర్శులను సొంత పంచాయతీ, మండలాల్లో నియమించరాదు. ఈఓపీఆర్‌డీ, ఎంపీడీఓ, డివిజనల్‌ స్థాయి అధికారులను సొంత డివిజన్లలో నియమించకూడదు. జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్‌ పంచాయతీ కార్యాలయాల్లోని సిబ్బంది బదిలీలకు సంబంధించి కలెక్టర్లకే పూర్తి అధికారం, క్వాలిటీ కంట్రోల్‌ విభాగాల్లో పని చేస్తున్న ఇంజినీర్లను విధిగా డివిజన్‌, సబ్‌ డివిజన్‌, మండలాలకు బదిలీ చేయాలని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే దీనికి పూర్తి విరుద్ధంగా జిల్లాస్థాయి అధికారులు వ్యవహరించారు. బదిలీల్లో ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేశారనే మాటలు ఉద్యోగుల నుంచే వస్తున్నాయి.

తిరుపతి రూరల్‌ మండలంలో మొత్తం 30 పంచాయతీ కార్యదర్శులకు గాను 17 మంది బదిలీ కాగా అందులో 13 మంది కొత్తగా వచ్చిన వారే కావడం గమనార్హం. తిరుపతి రూరల్‌ మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేయడానికి వచ్చిన వారిలో చాలా మందికి అర్హత (గ్రేడ్లు) లేనప్పటికీ ఆ అవకాశం కల్పించి మరీ పోస్టింగ్‌లు ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఇప్పటికే పదోన్నతులు పొంది తమకు అవకాశం వస్తుందని ఆశ పడిన ఎంతోమంది పంచాయతీ కార్యదర్శులకు నిరాశే ఎదురైంది. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన మూడు నెలలకే చేపట్టిన బదిలీల్లో చాలా చోట్ల నిబంధనలు పాటించకుండా గ్రేడ్లతో సంబంధం లేకుండా పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు ఇవ్వడంతో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. అయినా సరే లెక్క చేయకుండా వారిచేతనే పనులు చేయించిన జిల్లా అధికారులు తాజాగా జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో గ్రేడ్‌ల సమస్య రాకుండా చూస్తూనే అనుకున్న వారికి పోస్టింగ్‌ ఇచ్చేలా నిబంధనలు మార్చి తగిన రీతిలో బదిలీ ఫైళ్లను సిద్ధం చేసినట్టు సమాచారం.

గ్రేడ్‌లు పాటించకపోవడంపై లీగల్‌ నోటీసులు

చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా గత బదిలీల ప్రక్రియలో పంచాయతీ గ్రేడ్‌లతో సంబంధం లేకుండా కార్యదర్శులను నియమించడంతో తుడా మాజీ చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జిల్లా స్థాయి అధికారులకు లీగల్‌ నోటీసులు ఇచ్చారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న జిల్లా అధికారులు గ్రేడ్లు విషయంలో తేడా రాకున్నా, స్థానిక ప్రజాప్రతినిధి ఎవరికి చెబితే వారికి పోస్టింగ్‌ ఇవ్వడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకున్నట్టు సమాచారం. అదెలా అంటే ఒక పంచాయతీ కార్యదర్శి కోరు కున్న చోటుకు రావడానికి అర్హత లేకుంటే వారికి బదిలీతో పాటు బంపర్‌ ఆఫర్‌ కింద ఆ స్థాయికి సరిపడేలా పదోన్నతి కూడా కల్పించినట్టు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే పదోన్నతులు పొందిన పంచాయతీ కార్యదర్శులకు బదిలీల్లో తీరని అన్యాయం జరిగినట్టు విమర్శలు వస్తున్నాయి.

నోటీస్‌ బోర్డు

- జిల్లాలోని 8 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు
- శ్రీమహాలక్ష్మి జీప్‌ అండ్‌ సుమో, ట్యాక్సీ యూనియన్‌ సహకారంతో విష్ణువాసం ఎదురుగా ట్రాఫిక్‌ పోలీసులు ఆధ్వర్యంలో సౌండ్‌ పొల్యూషన్‌ నివారణలో భాగంగా ఉదయం 11.30 గంటలకు జీపులకు అతి భయంకరంగా సౌండ్‌ చేసే హారన్లను తొలగించే కార్యక్రమం
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శతావధాని ఆముదాల మురళిచే శ్రీమద్భాగవత సప్తాహం
- అప్పలాయగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు ఆలయ మాడవీధుల్లో అమ్మవారి తిరుచ్చి ఉత్సవం

నెల్లూరు శివారెడ్డికి నివాళి


శివారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భూమన

తిరుపతి మంగళం : నగరంలోని ఎన్జీఓ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు నెల్లూరు శివారెడ్డి ప్రథమ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్‌ నాయకులు తుడా వెంకటరెడ్డి, కెఎంకె సత్య, లడ్డీ వెంకటేష్‌, సతీష్‌, బాలాజి పాల్గొన్నారు.

తిరుపతి రూరల్‌ ఈఓపీఆర్‌డీగా దయాసాగర్‌

తిరుపతి రూరల్‌ : తిరుపతి రూరల్‌ మండలం ఈఓపీఆర్‌డీగా దయాసాగర్‌ నియమితులయ్యారు. వడమాలపేట మండలంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి రాగా.. తిరుపతి రూరల్‌ మండలం ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న మాధురి ఎర్రావారిపాళెంకు బదిలీ అయ్యారు. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వంలో శెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన దయాసాగర్‌ అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ ఈఓపీఆర్‌డీగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

నాణ్యమైన ఆహారం అందించాలి


అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్‌

తిరుపతి తుడా: అన్నా క్యాంటీన్లలో నిర్దిష్టమైన సమయంలో ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ మౌర్య నిర్వాహకులను ఆదేశించారు. గురువారం నగరంలోని ఎమ్మార్‌ పల్లిలో అన్నా క్యాంటీన్‌, రవీంద్ర నగర్‌, కేశవాయనగుంట, ఎమ్మార్‌ పల్లి టీటీడీ ఫ్లాట్ల వద్ద ప్రజల నుంచి వచ్చిన సమస్యలను, జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నా క్యాంటీన్‌ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రవీంద్ర నగర్‌, కేశవాయనగుంట, ఎమ్మార్‌ పల్లి టీటీడీ ఫ్లాట్స్‌ వద్ద పారిశుద్ధ్య పనులను మెరుగ్గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్‌ వెంట సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ శ్యాంసుందర్‌, మున్సిపల్‌ ఇంజినీర్‌ తులసి కుమార్‌, గోమతి, హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ యువ అన్వేష్‌, డీఈ మహేష్‌, శానిటరీ సూపర్‌ వైజర్‌ చెంచయ్య తదితరులు ఉన్నారు.

వేతనాలు పెంచాలని నిరసన


స్విమ్స్‌ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

తిరుపతి తుడా: స్విమ్స్‌ కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాలు పెంచి సమస్యలు తక్షణం పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె తప్పదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి హెచ్చరించారు. గురువారం స్విమ్స్‌ ఆసుపత్రి ప్రాంగణంలోని ఎన్టీఆర్‌ సర్కిల్‌ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్విమ్స్‌ కార్మికుల సమస్యలపై గత రెండున్నరేళ్లుగా అనేకమార్లు అధికారులకు విన్నవించినా, ధర్నాలు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే స్విమ్స్‌ డైరెక్టర్‌ టీటీడీ చైర్మన్‌, ఈఓ, రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక శాఖకు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి, అందరికీ చట్టబద్ధంగా సమ్మె నోటీసు రిజిస్టర్‌ పోస్టులో పంపించడం జరిగిందన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 18 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, స్విమ్స్‌ వర్కర్స్‌ యూనియన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వేణుగోపాల్‌, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి మాధవ్‌, హాకర్స్‌ యూనియన్‌ జిల్లా కార్యదర్శి బుజ్జి, పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

యానాది ఆడబిడ్డలకు సీట్లు ఇవ్వండి


గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజాసోముకు వినతిపత్రాన్ని ఇస్తున్న వైనం

తిరుపతి అర్బన్‌: యానాది ఆడబిడ్డలను చదువులకు దూరం చేయకుండా పాఠశాలలు, స్కూళ్లకు వెళ్లి చదువుకోవడానికి అవకాశం కల్పించాలని యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ బీఎల్‌ శేఖర్‌, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్‌ చేశారు. గురువారం కలెక్టరేట్‌ కార్యాలయంలోని గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజాసోమును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాది బిడ్డలు ముందే డ్రాపౌట్లుగా మిగిలిపోతున్నారని, ఈ పరిస్థితుల్లో వారికి చదువుపై అవగాహన కల్పించి గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించడానికి తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. గతంలో యానాదుల సీట్లు మిగిలిపోతూ వచ్చేవని గుర్తుచేశారు. అయితే ఈ ఏడాది శ్రీకాళహస్తి, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తిరుపతి అర్బన్‌ పరిధిలో యానాది బాలికలను గురుకులం స్కూళ్లు, కళాశాలల్లో చేర్పించడానికి వెళ్తే.. వారు సీట్లు ఖాళీలు లేవని చెప్పడం బాధాకరమన్నారు. చదువులకు యానాది బాలికలను దూరం చేస్తే వారికి బాల్య వివాహాలు చేసుకునే ప్రమాదం ఉందని గుర్తుచేశారు. చిన్నతనం నుంచే వారంతా పుస్తెల భారాన్ని మోయాల్సిన దుస్థితికి తీసుకురావద్దని కోరినట్లు వెల్లడించారు. శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కళ్యాణోత్సవం రోజు ఎంతోమంది బాల్యవివాహాలు దశాబ్దాలుగా కొనసాగుతున్న అంశాలను గుర్తుచేశారు. ఇప్పుడిప్పుడే బాల్యవావాహాల నుంచి దూరంగా ఉంటూ చదువులకు దగ్గరా బడిబాట పడుతున్న సమయంలో మళ్లీ యానాదుల బాలికలకు సీట్లు ఖాళీలు లేవని చెబితే వారికి కష్టాలు తప్పవని వారు వాపోయారు. ఈ అంశాలను జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారికి వివరించామని వెల్లడించారు. ఆ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. లేదంటే జిల్లా కలెక్టర్‌ వెంకటేశ్వర్‌ను కలుస్తామని అవసరమైతే పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు.

యువతకు కూటమి దగా

- కూటమి పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు గాలికి
- మీడియాతో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో యువత, విద్యార్థులను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్‌ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ గాలికి వదిలేసి డైవర్షన్‌ పాలిటిక్స్‌ చేస్తున్నారన్నారు. యువతకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని, అలాగే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి రాగానే దగా చేశారని మండిపడ్డారు. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్‌ చెల్లించకపోవడంతో కళాశాలల నుంచి విద్యార్థులను బయటకు గెంటేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనలో వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్ల ఉద్యోగాలను తీసేసిన ఘనత చంద్రబాబు, పవన్‌ కళ్యాణ్‌లకే దక్కుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్‌, పార్టీ నాయకులు ఓబుల్‌రెడ్డి, మల్లం రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ


సారె తీసుకొస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి నగర పరిధిలోని తిమ్మినాయుడుపాలెం గ్రామంలో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గురువారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి జాతరలో పాల్గొని గంగమ్మకు సారె సమర్పించారు. తిరుపతి నగర ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుశీలయాదవ్‌, ప్రసాద్‌యాదవ్‌, గురువయాదవ్‌, గుణసాయి, సంతోష్‌, సుధీర్‌, బాలకృష్ణ, గురుమూర్తియాదవ్‌, రాజేష్‌యాదవ్‌, చంద్రయ్యయాదవ్‌ పాల్గొన్నారు.

మొదటి రోజు మొక్కుబడి

- తిరుచానూరు జిల్లా పరిషత్‌లో నేలపైనే చదువులు


తిరుచానూరు జెడ్పీ పాఠశాలలో నేలపైన కూర్చున్న విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతున్న ఉపాధ్యాయులు

చంద్రగిరి: వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆశించిన స్థాయిలో విద్యార్థులు హాజరు కాకపోవడంతో స్కూళ్లు బోసిపోయాయి. చంద్రగిరి మండలవ్యాప్తంగా విద్యార్థులు నామమాత్రంగా పాఠశాలకు హాజరు కావడంతో వెలవెలబోయాయి. చంద్రగిరి ప్రభుత్వ బాలిక, బాలుర పాఠశాల్లో విద్యార్థులు ఒక్కో తరగతికి కనీసం పదిమంది కూడా లేకపోవడంతో ఉపాధ్యాయుల్లో కాస్త నిరాశపరిచింది. దీంతో వచ్చిన విద్యార్థులకే పాఠాలను బోధించారు. ఇక తిరుచానూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే ఇదే పరిస్థితి కనిపించింది. పాఠశాలలోని కొన్ని తరగతుల్లో విద్యార్థులను నేలపై కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం సాక్షి పరిశీలనలో తేలింది. విద్యార్థులకు మొదటి రోజే విద్యాసామగ్రిని అందించాల్సి ఉన్నప్పటికీ షూలు పంపిణీ వాయిదా వేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

చంద్రగిరిలో విద్యాసామగ్రి పంపిణీ..

చంద్రగిరి ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల్లో ఎంఈఓ–2 భాస్కర్‌ బాబు విద్యార్థులకు విద్యాసామగ్రిని హెచ్‌ఎం వెంకటరమణ రెడ్డితో కలసి అందజేశారు. మరో ఎంఈఓ లలితకుమారి మండల పరిధిలోని రాయలపురం ప్రాథమిక పాఠశాలను సర్పంచ్‌ వెంకటయ్యతో కలసి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనానికి వినియోగించే బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు.

డబ్బు ఇవ్వలేదని తల్లి, కుమారుడిపై పెట్రోల్‌ దాడి

తిరుపతి క్రైమ్‌ : ఇచ్చిన డబ్బుల్లో కొంత భాగం ఇవ్వలేదని ఓ మహిళ మరో మహిళ, ఆమె కుమారుడిపై పెట్రోల్‌తో దాడిచేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. నగరంలోని సుబ్బారెడ్డినగర్కు చెందిన గీత, ఆమె కుమారుడు హేమకుమార్‌ గత జనవరిలో నెల్లూరుకు చెందిన కుమారి అనే మహిళకు ఎంబ్రాయిడరీ మెషిన్‌ రూ.4 లక్షలకు విక్రయించి డబ్బు తీసుకున్నారు. కానీ మెషిన్‌ కుమారికి డెలివరీ చేయలేదు. గీత తీసుకున్న రూ.4 లక్షల్లో రూ.3.4 లక్షలు వెనక్కి ఇచ్చేశారు. మిగిలిన రూ.60 వేలు ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు కుమారి పలు మార్లు గీతను అడిగినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో బుధవారం తిరుపతికి వచ్చి గీతతో గొడవ పెట్టుకుంది. అదే సమయంలో గీత, ఆమె కుమారుడు హేమకుమార్‌పై ఒక్క సారిగా పెట్రోల్‌ పోసి లైటర్‌ వెలిగించి వెళ్లిపోయింది. స్థానికులు గమనించి మంటలార్పి గాయపడ్డ గీత, హేమకుమార్‌ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు నిందితురాలిని గురువారం లెప్రసీ హాస్పిటల్‌ వద్ద అరెస్ట్‌ చేసి కోర్టుకు తరలించారు.





సమస్యల వెంబడి

బడికి వడివడిగా అడుగులు పడ్డాయి. బడి గంట మోగగానే ఇంట్లోనూ తల్లిదండ్రుల ఉరుకులు పరుగులు కనిపించాయి. ముందుగా దైవదర్శనాల కోసం పరుగులు తీశాయి. ఆనక విద్యార్థులు బడికి బయలుదేరారు. ఈ క్రమంలో పాఠశాలలను చూసి మురిసిపోయారు. ఉపాధ్యాయులను చూసి ఉప్పొంగిపోయారు. మొదట తమ చదువులు చక్కగా సాగాలని దేవుణ్ని ప్రార్థించారు. ఆ తర్వాత తరగతి గదిలోకి అడుగు పెట్టగానే.. ఉపాధ్యాయులను చూసి 'గుడ్‌మార్నింగ్‌ టీచర్‌..' అయితే తిరుపతిలోని ఎంజీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి అడుగు పెట్టగానే దుమ్ము ధూళితో తరగతి గదులు కనిపించాయి. కనీసం తరగతి గదులను శుభ్రపరచకుండా విద్యార్థులను దుమ్ముధూళిలో కూర్చోబెట్టారు. విద్యార్థులే కుర్చీలు, టేబుళ్లను అతికష్టం మీద మోసుకెళ్తూ కనిపించారు. మరోవైపు పాఠశాల ఆవరణలో చెత్తల దిబ్బలతో కనిపించాయి. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌ మనిపించింది

సాక్షి ఫొటోగ్రాఫర్‌, తిరుపతి